సాక్షి
రంగారెడ్డి

ఆదివారం । 6 । జులై । 2025



గుట్టుగా గంజాయి దందా

మత్తుపదార్థాల విక్రయం జోరందుకుంది. కొందరు అక్రమార్కులు.. గుట్టుగా వ్యాపారం కొనసాగిస్తున్నారు. 8లో▸



తప్పడు వ్యాఖ్యలు చేశారని

ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ సీఎం కేసీఆర్‌పై తప్పడు వ్యాఖ్యలు చేశారంటూ బీఆర్ఎస్ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 8లో▸



ముగిసిన నవరాత్రులు

కుర్తాళం పీఠం శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి దేవాలయంలో వారాహి దేవి నవరాత్రులు ఘనంగా నిర్వహించారు. 8లో▸

న్యూస్‌రీల్

పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్‌రూరల్: సాంఘిక సంక్షేమ వికారాబాద్ మహిళా డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తోల్‌కట్ట సమీపంలోని ఎస్వీ కళాశాలలో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ వికారాబాద్ మహిళా డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న డీఎల్ కంప్యూటర్ సైన్స్–1, తెలుగు–1, ఫిజిక్స్–1, జువాలజీ–1, ఎకనామిక్స్–1 సబ్జెక్టులకు సంబంధించి పార్ట్ టైమ్ ప్రాతిపదికన పని చేసేందుకు పీజీ పూర్తి చేసిన, ఆసక్తి గల మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. నెట్, సెట్ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ నెల 9న నిర్వహించే డెమోకు సంబంధిత సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలలోపు హాజరుకావాలని సూచించారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి



అభివాదం చేస్తున్న బీసీ సంఘం నేతలు

తుక్కుగూడ: రాష్ట్రంలో ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ డిమాండ్ చేశారు. పురపాలిక కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో శనివారం బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీలకు ఇచ్చిన హామీని నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మభ్య పెడుతోందని విమర్శించారు. రానున్న రోజుల్లో అన్ని పార్టీలు బీసీలకు అధిక స్థానాలు కేటాయించాలన్నారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 22 జిల్లాలో సభలు నిర్వహించి, కమిటీలు వేసి, బీసీలను రాజకీయంగా, సామాజికంగా చైతన్య పరచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సంఘం సమన్వయ కర్తలు కర్నాటి మనోహర్, గండి వీరేందర్, రచ్చ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై ఎందుకంత ఉలికిపాటు?



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రఘు నాయక్

షాద్‌నగర్: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై షాద్‌నగర్ స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఎందుకు ఉలిక్కి పడుతున్నారని కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు నాయక్ ప్రశ్నించారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. షాద్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ నేతల ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఎవరి పేర్లు ఎక్కడా తాము ప్రస్తావించలేదని అన్నారు. కొందరు బీఆర్ఎస్ నేతలు సమావేశాలు ఏర్పాటు చేసి ఎమ్మెల్యేకు అల్టిమేటం ఇచ్చే విధంగా మాట్లాడటం సరికాదన్నారు. ఈ విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు హరినాథ్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఐటీ పార్క్ సర్వే



రావిర్యాలలో సర్వే చేస్తున్న అధికారులు

తుక్కుగూడ: పురపాలిక పరిధిలోని రావిర్యాల కొంగరఖుర్దు రెవెన్యూ ఏ సర్వే నంబర్ 289లో ఉన్న అసైన్డ్ భూమిని ప్రభుత్వం ఐటీ పార్క్‌కు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ భూమిలో టీజీఐఐసీ, రెవెన్యూ అధికారులు శనివారం సర్వే చేపట్టారు. కబ్జాలో ఉన్న రైతుల నుంచి వివరాలు సేకరించారు. సర్వే వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీజీఐఐసీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఎరువు.. కరువు!



జిల్లాలో వేధిస్తున్న కొరత

- వానాకాలం సాగుకు 72 వేల మెట్రిక్ టన్నులు అవసరం
- ఇప్పటి వరకు సరఫరా చేసింది 14,127 మెట్రిక్ టన్నులే..
- బస్తా డీఏపీ రూ.1,350 కాగా, రూ.1,500కు అమ్మకం
- బస్తా యూరియా రూ.266 కాగా, రూ.300కుపైగా విక్రయం
- విధిలేక కొనుగోలు చేసి నష్టపోతున్న రైతులు
- పట్టించుకోని వ్యవసాయశాఖ అధికారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎరువుల కొరత జిల్లాలో తీవ్రంగా వేధిస్తోంది. పంట విస్తీర్ణం నిష్పత్తి మేరకు సరఫరా లేకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. పంట విత్తన సమయంలో డీఏపీ వాడుతుంటారు. కీలకమైన ఈ సమయంలో అయా ఎరువులు దొరకడం లేదు. రైతుల్లో ఉన్న బలహీనతను కొంతమంది హోల్‌సేల్ డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు క్యాష్ చేసుకునేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. ప్రభుత్వం సరఫరా చేసిన డీఏపీకి కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. అమాంతం ధర పెంచి రైతులను నిలువుదోపిడీకి గురి చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం డీఏపీ బస్తా ధర రూ.1,350 ఉండగా, డీలర్లు రూ.1,500కు పైగా, యూరియా బస్తా రూ.266 ఉండగా, రూ.300కు పైనే విక్రయిస్తున్నారు. విధిలేని పరిస్థితుల్లో రైతులు వారు చెప్పిన ధరలకే కొనుగోలు చేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు.

ప్రైవేటు డీలర్ల భిన్న వాదన

మారుమూల కేంద్రాల్లోని ప్రైవేటు డీలర్ల వాదన ఇందుకు భిన్నంగా ఉంది. హోల్‌సేల్ డీలర్లే ఎంఆర్‌పీకి మించి తమ నుంచి వసూలు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. హమాలీ, రవాణా ఖర్చుల భారాన్ని కూడా తమపైనే మోపుతున్నారని చెబుతున్నారు. ముందస్తు అడ్వాన్స్‌లు చెల్లించి, ఎరువులను దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని, కొన్ని సందర్భాల్లో ఉద్దెరకు ఇవ్వాల్సి వస్తోందంటున్నారు. హోల్‌సేల్ డీలర్లను నియంత్రించకుండా తమపై ఆంక్షలు విధించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

అంచనాలకు మించి అవసరాలు

ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 3,47,989 ఎకరాల విస్తీర్ణంలో పత్తి, వరి, జొన్న, మొక్క జొన్న, వేరుశనగ, కంది, ఇతర పంటలు సాగవుతున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అంచనాలు సిద్ధం చేసింది. కొందుర్గు, చౌదరిగూడ, షాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, మాడ్గుల, తలకొండపల్లి, కేశంపేట, ఫరూఖ్‌నగర్, ఆమనగల్లు, కడ్తాల్, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లో ఎక్కువగా ఈ పంటలు సాగవుతున్నాయి. ఈ సీజన్‌లో 72 వేల మెట్రిక్ టన్నుల డీఏపీ, యూరియా, ఇతర ఎరువులు అవసరం ఉంటుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఏప్రిల్ నుంచి జూన్ ఆఖరి నాటికి 14,127 మెట్రిక్ టన్నులకు మించి సరఫరా కాలేదు. కంపెనీలు, హోల్‌సేల్, ప్రైవేటు డీలర్ల వద్ద 29,827 మెట్రిక్ టన్నుల నిల్వలు ఉన్నట్లు జిల్లా వ్యవసాయశాఖ లెక్కలు చూపుతున్నా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. డిమాండ్‌కు సరఫరాకు మధ్య భారీ వ్యత్యాసం ఉండటాన్ని పలువురు డీలర్లు/డిస్ట్రిబ్యూటర్లు అవకాశంగా తీసుకుంటున్నారు. ఆశించిన స్థాయిలో డీఏపీ దొరకకపోవడంతో ప్రత్యామ్నాయంగా కాంప్లెక్స్ ఎరువులను వాడాల్సిందిగా వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. కాంప్లెక్స్ ఎరువుల వాడకంతో పంట ఏపుగా పెరగడం సంగతేమోగానీ తర్వాత చీడపీడల బెడద ఎదుర్కోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. ఎరువుల సరఫరా, నిల్వలపై ఎప్పటికప్పుడు నిఘా ఏర్పాటు చేయాల్సిన వ్యవసాయశాఖ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండటంతో ప్రైవేటు డీలర్లు ఆడిందే ఆటపాడిందే పాట అన్నట్లుగా మారింది.

డీఏపీ దొరకడం లేదు



కావాల్సిన ఎరువులు దొరకడం లేదు. డీలర్లు డీఏపీ కొరత ఉందని అంటున్నారు. దాని స్థానంలో కాంప్లెక్స్ ఎరువులు వాడుకోవాలని సూచిస్తున్నారు. ఒక దానికి బదులు మరో ఎరువు వాడితే పంట దెబ్బ తినే ప్రమాదం ఉంది. డీఏపీ సహా యూరియా ప్రభుత్వ ధరలకు మించి అమ్ముతున్నారు. ఒక్కో బస్తాపై రూ.50 నుంచి రూ.60 అదనంగా వసూలు చేస్తున్నారు.

– చెన్నకేశవులు, ముట్పూర్ గ్రామం

తనిఖీలు చేయిస్తాం



జిల్లాలో ఎరువుల కొరత లేదు. ఇటీవలే కలెక్టర్ కంపెనీలు, డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎరువుల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు రాని వ్వొద్దని సూచించారు. మండల వ్యవ సాయశాఖ అధికారులతో తనిఖీలు చేయిస్తాం. ఎవరైనా డీలర్లు కృత్రిమ కొరత సృష్టించి, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. రైతులను ఇబ్బందులకు గురి చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించం.

– నర్సింహారావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

ఎలాంటి ఇబ్బందీ రావొద్దు

- ప్లాట్ల పంపిణీ సజావుగా నిర్వహించాలి
- అధికారులకు కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం
- మీర్‌ఖాన్‌పేటలోని ఫార్మా వెంచర్ పరిశీలన

కందుకూరు: ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు కేటాయించనున్న ప్లాట్ల పంపిణీని సజావుగా నిర్వహించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట రెవెన్యూలో ఏర్పాటు చేసిన వెంచర్‌ను శనివారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఏటీసీ సెంటర్‌లో అధికారులతో మాట్లాడారు. సోమవారం రైతులకు కేటాయించనున్న ప్లాట్లకు సంబంధించిన లాటరీ ప్రక్రియను ఎలా చేపట్టాలో అవగాహన కల్పించారు. ఐదు టేబుళ్లు ఏర్పాటు చేసి గ్రామాల వారీగా లాటరీ ద్వారా ప్లాట్లను కేటాయించాలని సూచించారు. మొదటగా 60 గజాలు, ఆ తర్వాత 121 గజాలు పంపిణీ చేయాలన్నారు. ఎలాంటి సమస్యలు లేకుండా వంద శాతం ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓలు జగదీశ్వర్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, తహసీల్దార్లు గోపాల్, అయ్యప్ప, టీజీఐఐసీ జీఎం శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఏటీసీ సెంటర్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ఐక్య పోరాటానికి సిద్ధం కావాలి

షాద్‌నగర్: హక్కుల సాధన కోసం మాలలంతా ఐక్యపోరాటానికి సిద్ధం కావాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చి ఏళ్లు గడుస్తున్నా మాలలు అన్ని రంగాల్లో పూర్తిగా వెనకబడే ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాలల అభివృద్ధిపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా మాలలపై దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయన్నారు. మాలల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘం డివిజన్ కార్యదర్శిగా ఎక్లాస్‌ఖాన్‌పేటకు చెందిన గాలయ్యను ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు నర్సింహ, శ్రీనివాస్, అశోక్, కుమార్, చెన్నయ్య, యాదగిరి, పెంటయ్య, రవి, రమేష్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



డివిజన్ కార్యదర్శికి నియామకపత్రం అందజేస్తున్న జిల్లా అధ్యడు మహేశ్

ఎనికేపల్లిలో భూముల సర్వే



బారికేడ్లు పెట్టి రైతులను అడ్డుకుంటున్న పోలీసులు

- విషయం తెలిసి అక్కడికి చేరుకున్న రైతులు
- అటువైపు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు

మొయినాబాద్: గోశాలకు కేటాయించిన భూముల సర్వే పోలీస్ పహారాలో చేపట్టారు. హెచ్ఎండీఏ, రెవెన్యూ అధికారులు శనివారం భూములను సర్వే చేశారు. అటువైపు ఎవరూ వెళ్లకుండా భారీగా పోలీసులు మోహరించారు. విషయం తెలుసుకుని భూముల వద్దకు వెళ్తున్న రైతులను అడ్డుకున్నారు. మున్సిపల్ పరిధిలోని ఎనికేపల్లి రెవెన్యూ సర్వేనంబర్ 180లో ఉన్న 99.14 ఎకరాల భూమిని ప్రభుత్వం గోశాలకు కేటాయించింది. ఈ భూములను దెబ్బై ఏళ్లుగా సాగుచేసుకుంటున్న రైతులు తమకు న్యాయం చేయాలంటూ పోరాటం చేస్తున్నారు. నెల రోజులకుపైగా అధికారులు రైతులతో చర్చలు జరిపారు. పరిహారం విషయం ఎటూ తేలకపోవడంతో రైతులు కోర్టుకు వెళ్లారు.

దూకుడు పెంచిన అధికారులు

హెచ్ఎండీఏ అధికారులతో కలిసి సర్వే నిర్వహించాల్సి ఉండగా ఇప్పటికే రెండుసార్లు వాయిదా వేశారు. ఇక రైతులు వినే పరిస్థితిలో లేరని భావించిన హెచ్ఎండీఏ, రెవెన్యూ అధికారులు శనివారం పోలీసుల సాయంతో సర్వే చేపట్టారు. సుమారు 200 మందికి పైగా పోలీసులు మోహరించారు. భూములవైపు వెళ్లే దారులను మూసివేశారు. గోశాలకు కేటాయించిన భూమిలో నుంచి అమ్డాపూర్ రోడ్డు– ఎనికేపల్లిని కలుపుతూ 15 అడుగుల వెడల్పుతో రోడ్డు ఉంది. ఆ రోడ్డును 30 అడుగులకు పెంచుతూ అధికారులు సర్వే నిర్వహించారు. మొత్తం భూమి సర్వే చేసి హద్దులను ఏర్పాటు చేశారు. చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళ దగ్గరుండి సర్వే చేయించారు.

గంటల్లో సర్వే పూర్తి

సర్వే విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి వెళ్లే ప్రయత్నం చేశారు. అప్పటికే మోహరించి ఉన్న పోలీసులు వారిని అడ్డుకున్నారు. భూముల్లోకి వెళ్లకుండా బారికేడ్లు అడ్డు పెట్టారు. దీంతో రైతులు ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమకు న్యాయం చేయకుండా భూములను ఎలా తీసుకుంటారని ప్రశ్నించారు. పరిహారం విషయంలో ప్రభుత్వం మొండి వైఖరి వీడి తమకు న్యాయమైన పరిహారం ఇవ్వాలన్నారు. రెండు గంటల్లో సర్వే పూర్తిచేసిన అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. దీంతో పోలీసులు రైతులను పంపించివేశారు.

'డబుల్' లబ్ధిదారులకు న్యాయం చేయాలి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

మంచాల: డబుల్ బెడ్రూం లబ్ధిదాలకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని లింగంపల్లి గేట్ వద్ద ఇళ్లలోకి వెళ్లిన లబ్ధిదారులను శనివారం ఆయన కలిశారు. ఇళ్లను పరిశీలించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వం హయాంలో లింగంపల్లి గేట్ వద్ద 96 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. అప్పుడే లబ్ధిదారులను కూడా గుర్తించామన్నారు. కేవలం వారికి సర్టిఫికెట్లు ఇచ్చి గృహ ప్రవేశం చేయించేది మాత్రమే మిగిలి ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్ని నెలలైనా పట్టించుకోక పోవడంతో లబ్ధిదారులు గత్యంతరం లేక గృహ ప్రవేశం చేశారని తెలిపారు. పోలీసులతో బెదిరింపులకు పాల్పడడం, ఇళ్లు ఖాళీ చేయాలని అధికారులు ఒత్తిడి చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అక్కడి నుంచే ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి లబ్ధిదారులకు న్యాయం చేయాలని సూచించారు. బాధితులకు అండగా ఉంటామని, ఎవరూ ఆందోళనకు గురికావొద్దని భరోసా కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకట రమణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు చీరాల రమేష్, మాజీ ఎంపీపీలు నర్మద, ఇందిర, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చంద్రయ్య, మాజీ వైస్ చైర్మన్ దండేటికార్ రవి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఫార్మా ప్లాట్ల కేటాయింపు

కందుకూరు: ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు అభివృద్ధి చేసిన లేఅవుట్‌లో ఈనెల 7న (సోమవారం) ఉదయం 9 గంటల నుంచి లాటరీ ద్వారా ప్లాట్లను కేటాయించనున్నట్లు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట, ముచ్చర్ల, పంజగూడ, యాచారం మండలం కుర్మిద్ద, మేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి రెవెన్యూ గ్రామాలకు సంబంధించి భూములు కోల్పోయిన రైతులకు మీర్‌ఖాన్‌పేట రెవెన్యూలో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో ప్లాట్లను కేటాయించనున్నట్లు తెలిపారు. మొదటి రోజు 60 గజాలు, రెండో రోజు 121 గజాలు, మూడో రోజు 181 గజాలు, నాలుగో రోజు మిగతా ప్లాట్లను లాటరీ ద్వారా కేటాయిస్తామన్నారు. భూ నిర్వాసితులు గతంలో జారీ చేసిన ప్లాట్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, పాన్ కార్డు, పాన్‌కార్డు లేని వారు ఫారం–60, ఫారం 32ఏతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో రావాలన్నారు. ఉదయం 8 గంటల వరకు బేగరికంచె గ్రామ పరిధిలోని లేఅవుట్ వద్దకు చేరుకోవాలని ఆయన సూచించారు.



'ఉపాధి'లో నిర్లక్ష్యం తగదు

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలకొండ కాంతయ్య

షాద్‌నగర్‌రూరల్: ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం నిధులు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో శనివారం ఉపాధి హామీ కార్మికులతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. గ్రామాల్లో ఎంతో మంది పేదలు ఈ పథకంలో కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. పథకాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు పుస్తకాల నర్సింగరావు, పాల్మాకుల జంగయ్య, యాదయ్య, పానుగంటి పర్వతాలు, టంగుటూరి నర్సింహారెడ్డి, లక్ష్మయ్య, రమేష్, వెంకటేశ్, స్వరూప, యశోద, రాములు, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై దాడులు

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

తుర్కయంజాల్: బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ అన్నారు. పురపాలక సంఘం పరిధి మన్నెగూడలో నిర్వహిస్తున్న కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) శిక్షణ తరగతులకు శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఒడిశా రాష్ట్రంలో ఇద్దరు దళిత యువకులు దూడలను తీసుకెళ్తుండగా గోరక్షక దళాల ముసుగులో వచ్చిన కొందరు దాడి చేసి చిత్రహింసలకు గురిచేయడం దారుణం అని పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ ప్రోద్బలంతోనే ఇలాంటి ఘాతుకాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అమానవీయ సంఘటనలను అందరం ఖండించాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోడ సామేల్, మస్కు ప్రకాష్ కారత్, నాయకులు కె. అరుణ్ కుమార్, ఎర్ర వెంకటేశ్, ఆనంద్ కుమార్, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న భూపాల్

కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

ఇబ్రహీంపట్నం రూరల్: అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.భూపాల్ అన్నారు. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని బొంగ్లూర్ ఔటర్‌రింగ్‌రోడ్డు సమీపంలో హెచ్ఎండీఏ కార్మికులతో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి.జగదీష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన భూపాల్ మాట్లాడుతూ.. పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మికవర్గాన్ని బలిచ్చే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేఖ విధానాలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. మే 20న జరగాల్సిన సమ్మె అనివార్య కారణాలతో ఈనెల 9వ తేదీకి మార్చడం జరిగిందన్నారు. సమ్మెను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కూలీలు, సీఐటీయూ బాధ్యులు పాల్గొన్నారు.

నివాళి



యాదమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సబితారెడ్డి

చేవెళ్ల: ముడిమ్యాలకు చెందిన డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకటస్వామి సతీమణి, మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు యాదమ్మ(70) శుక్రవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న పలువురు ప్రముఖులు శనివారం ఆమె భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. వీరిలో మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఉన్నారు.

మద్యం దుకాణంలో చోరీ

ఇబ్రహీంపట్నం: మద్యం దుకాణంలో గుర్తు తెలియని దుండగులు చొరబడి 20 ఫుల్ బాటిళ్లను అపహరించారు. ఈ సంఘటన శనివారం తెల్లవారుజామున ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాలప్రకారం.. మంగల్‌పల్లి క్రాస్ రోడ్డు వద్ద కనకదుర్గ వైన్స్ పైకప్పు రేకులను దుండగులు తొలగించి, మద్యం సీసాలను ఎత్తుకెళ్లారు. దుకాణ యాజమాని శ్రీకాంత్‌రావు ఫిర్యాదు మేరకు.. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి



లఘులయ్య (ఫైల్)

మొయినాబాద్‌రూరల్: అనారోగ్యంతో బాకారం జాగీరు వీఆర్‌ఏ కావలి లఘులయ్య శనివారం మృతి చెందారు. మండల పరిధి బాకారంలో వీఆర్‌ఏగా విధులు నిర్వహించిన ఆయన.. కొద్దిరోజులుగా తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్నారు. ఇటీవలే కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యాడు. ఈ క్రమంలో ఆరోగ్య సమస్యలతో ఆయన చికిత్స పొందుతూ చనిపోయాడు. కొత్తపల్లి రాఘవరెడ్డి, సుధాకర్‌యాదవ్, తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుపతిరెడ్డి పలువురు ఆయన మృతికి సంతాపం తెలిపారు.

సంపులో పడి వ్యక్తి..

ఇబ్రహీంపట్నం రూరల్: నిర్మాణంలో ఉన్న ఇంటి సంపులో పడి ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ రాజు కథనం ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన కొమ్మని గిరిబాబు(36).. కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. రాత్రి సమయంలో ప్రమాదవశాత్తు సంపులో పడి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

గుట్టుగా గంజాయి దందా..

షాద్‌నగర్, కొత్తూరులో జోరుగా మత్తుపదార్థాల విక్రయం

- హోటళ్లు, పాన్‌షాప్‌లు, కిరాణ దుకాణాలే అడ్డా
- వరుస దాడుల్లో పట్టుబడుతున్న గాంజా



ఇటీవల కార్డన్‌సెర్చ్‌లో పట్టుబడిన గంజాయి చాక్లెట్లు

షాద్‌నగర్/కొత్తూరు: రాష్ట్ర రాజధాని మహానగరానికి చేరువలో ఉన్న కొత్తూరు మండలం అన్ని రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. పట్టణ రూపురేఖలు మారిపోయాయి. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ.. అభివృద్ధితో పాటు.. మత్తుపదార్థాల విక్రయం జోరందుకుంది. కొందరు అక్రమార్కులు.. ఎలాంటి అనుమానం కలగకుండా.. పోలీసుల నిఘాకు చిక్కకుండా వ్యాపారం కొనసాగిస్తున్నారు. మండల పరిసర ప్రాంతాల్లో ఎన్నో పరిశ్రమలు కొలువుదీరగా.. ఉపాధి నిమిత్తం దేశ నలుమూలల నుంచి వలసలు పెరిగాయి. పెంజర్ల, తీగాపూర్ గ్రామాల్లో బీహార్, ఒడిస్సా, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన వారు నివసిస్తున్నారు. దీనిని అవకాశంగా మలుచుకున్న స్మగ్లర్లు.. నిషేధిత గంజాయి, గంజా చాక్లెట్లు, గుట్కాలను విక్రయిస్తూ కూలీలు, విద్యార్థులు, యువత ఆరోగ్యాలను కొల్లగొడుతూ.. పోలీసులకు సవాల్‌గా మారారు.

తరగతి గదుల్లో మత్తు చాక్లెట్లు

గతేడాది పట్టణంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో కొందరు విద్యార్థులు తరగతి గదుల్లో మత్తుగా ఉంటున్న విషయాన్ని పాఠశాల హెచ్‌ఎం గుర్తించారు. తర్వాత కొందరు విద్యార్థులు ఇచ్చిన సమాచారంతో వారు తింటున్న చాక్లెట్లను పరిశీలించగా అనుమానం కలిగి.. పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు.. పాఠశాల పక్కనేన్న పాన్‌డబ్బా, దర్గా రోడ్డులోని కిరాణం, పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న మరో కిరాణంలో తనిఖీలు చేయగా పెద్దమొత్తంలో మత్తు చాక్లెట్లు లభ్యమయ్యాయి. వీటిని పరీక్షల కోసం పంపగా గంజాయి చాక్లెట్లుగా తేలింది. ➡ పారిశ్రామికవాడ సమీపంలోని తీగాపూర్ శివారులో ఓ హోటల్‌లో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందగా.. ఎస్ఓటీ పోలీసులు దాడి చేసి గంజాయి సిగరేట్లు, గంజా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ➡ ఇటీవల పట్టణంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించగా.. పెంజర్ల రోడ్డులో ఉన్న టీకొట్టులో గంజాయి చాక్లెట్లు దొరికాయి.

కఠిన చర్యలు తీసుకుంటాం...



నిషేధిత మత్తు పదార్థాలు గుట్కా, గంజాయి, ఇతరత్రా డ్రగ్స్ విక్రయించడం చట్టరీత్యా నేరం. పట్టణంలో తరచుగా తనిఖీలు చేపడుతున్నాం. పలుచోట్ల గంజాయిని స్వాధీనం చేసుకున్నాం. డ్రగ్స్ అమ్మినట్లు తెలిస్తే సమాచారం ఇవ్వండి. కఠిన చర్యలు తీసుకుంటాం.

– నర్సింహ్మారావు, సీఐ, కొత్తూరు

కిరాణ కొట్టులో మత్తు చాక్లెట్లు..

- నిందితుడి నుంచి 11 కిలోల గంజాయి చాక్లెట్లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీపీఈఓ ఉజ్వల రెడ్డి

వలస కార్మికులే వారి టార్గెట్. ధనార్జనే ధ్యేయంగా కిరాణ దుకాణం మాటున గుట్టు చప్పుడు కాకుండా గంజాయి చాక్లెట్లు విక్రయిస్తూ.. శ్రమజీవుల జీవితాలతో చెలగాట మాడుతున్న వ్యక్తిని.. ఎక్సైజ్ పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. నిందితుడి నుంచి రూ.3.50 లక్షల విలువ చేసే 11కిలోల 130 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారిణి ఉజ్వల రెడ్డి వెల్లడించారు.

వలస వచ్చి..

బీహార్ రాష్ట్రానికి చెందిన పింటూసింగ్.. కొంత కాలం క్రితం షాద్‌నగర్‌లోని నందిగామకు వలస వచ్చాడు. పారిశ్రామిక వాడలోని అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద కిరాణం దుకాణంతో పాటు.. చిన్న హోటల్‌ను నిర్వహిస్తూ.. జీవనం సాగిస్తున్నాడు. తక్కువ సమయంలో ఎక్కువ ధనం సంపాదించాలనే ఆశతో.. పచారి కొట్టు పేరుతో దుకాణానికి వచ్చే కార్మికులకు గంజాయి, మత్తు చాక్లెట్లు విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు రెక్కీ నిర్వహించిన ఎక్సైజ్ పోలీసులు.. శుక్రవారం రాత్రి కిరాణ దుకాణంపై దాడులు నిర్వహించారు. నిందితుడి నుంచి 2.250 కిలోల ఎండు గంజాయి, 9.13 కిలోల గంజాయి చాక్లెట్లతో పాటు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పింటూసింగ్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడు ఎక్కడి నుంచి గంజాయిని దిగుమతి చేసుకుంటున్నాడు.. ఎవరు సరఫరా చేస్తున్నారనేది దర్యాప్తులో తేలనుందని డీపీఈఓ వెల్లడించారు. సమావేశంలో ఎక్సైజ్ ఎస్ఐలు సునీత, శ్రీనివాస్, సిబ్బంది రవి, సుధీర్, వినోద్, రాజయ్య, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

మీర్‌పేట: షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లోని సామగ్రి కాలి బూడిదైన సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజశేఖర్ కథనం ప్రకారం.. మీర్‌పేట మారుతీనగర్‌లో నివాసముండే వరప్రసాద్.. భార్య లక్ష్మీప్రసన్నతో కలిసి మూడు రోజుల క్రితం బెంగళూరుకు వెళ్లాడు. ఇంట్లో ఉన్న కుమారుడు శనివారం సాయంత్రం తాళం వేసి, బయటకు వెళ్లాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా మొదటి అంతస్తు బెడ్‌రూములో నుంచి మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా, వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే గదిలోని వస్తువులు, విలువైన పత్రాలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఏసీ ఆన్ చేసి ఉంచడం వలనే ప్రమాదం జరిగి ఉంటుందని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కాపాడిన కానిస్టేబుల్



చికిత్స పొందుతున్న బాధితుడితో కానిస్టేబుల్

ఆమనగల్లు: కుటుంబ సభ్యులతో గొడవపడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడిని కానిస్టేబుల్ కాపాడారు. ఈ సంఘటన శనివారం తలకొండపల్లిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. తలకొండపల్లి మండలం మెదక్‌పల్లి గ్రామానికి చెందిన దరువుల మత్స్యేందర్.. ఇంట్లో గొడవపడి వెళ్లిపోయాడు. కుటుంబీకులు వెతికినప్పటికీ అతడి ఆచూకీ లభించలేదు. దీంతో వారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనికి వెంటనే స్పందించిన కానిస్టేబుల్ జాషువా.. యువకుడి సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా ఎక్కడున్నారో తెలుసుకున్నారు. అక్కడికి వెళ్లే సరికి మత్స్యేందర్ పురుగుల మందు బలవన్మరణానికి యత్నించాడు. వెంటనే కానిస్టేబుల్.. కుటుంబీకులకు సమాచారం అందించి, బాధితున్ని కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయించాడు. సకాలంలో స్పందించి యువకుడి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్‌ను ఎస్ఐ శ్రీకాంత్ అభినందించారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



నరేష్ (ఫైల్)

కేశంపేట: తండ్రి మరణం, దానికి తోడు ఆరోగ్య సమస్యలు తలెత్తడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తలకొండపల్లి మండలం వెంకటపూర్ గ్రామానికి చెందిన మద్దూరి నరేష్(26).. తండ్రి అంజయ్య ఏడు నెలల క్రితం మృతి చెందాడు. తండ్రి మరణాన్ని జీర్ణించుకోలేని తనయుడు.. నాటి నుంచి తీవ్ర మనస్తాపంతో కృంగిపోయేవాడు. ఈ క్రమంలో కేశంపేట గ్రామంలో ఉంటున్న అక్క మాధవి ఇంటికి ఈ నెల 2న నరేష్ వెళ్లాడు. 3వ తేదీ రాత్రి ఇంట్లో గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన సోదరి.. యువకుడిని అంబులెన్స్‌లో ఉస్మానియాకు తరలించింది. అక్కడ చికిత్స పొందుతూ.. శనివారం మృతి చెందాడు. మృతుడి తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నామని సీఐ నరహరి తెలిపారు.

తప్పుడు వ్యాఖ్యలు చేశారంటూ ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

బంజారాహిల్స్: ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై తప్పుడు వ్యాఖ్యలు చేసిన ఐడ్రీమ్స్ ఛానల్ యాంకర్ సౌమ్యారెడ్డి, అడ్వొకేట్ అరుణ్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నేతలు శనివారం బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గత నెల 25వ తేదీన అరుణ్‌కుమార్ అనే అడ్వొకేట్‌తో సదరు ఛానల్ యాంకర్ ఇంటర్వ్యూ చేసి ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్ పేరును వాడుతూ..అబద్ధపు మాటలతో తప్పుడు ఆరోపణలు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. యాంకర్‌తో పాటు అడ్వొకేట్, చానల్ యాజమాన్యం మీద చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో నేతలు వాసుదేవరెడ్డి, గాంధీనాయక్, బమ్మెర రామ్మూర్తి, కురువ పల్లయ్య తదితరులు ఉన్నారు. బంజారాహిల్స్ పోలీసులు ఫిర్యాదును స్వీకరించి దర్యాప్తు చేపట్టారు.

ముగిసిన వారాహిదేవి నవరాత్రులు



పూర్ణాహుతి కార్యక్రమం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్కేపురంలోని కుర్తాళం పీఠం శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి దేవాలయంలో ఉత్తర పీఠాధిపతి దత్తేశ్వరానంద భారతి మహాస్వామి వారి సమక్షంలో వారాహి దేవి నవరాత్రులు తొమ్మిది రోజులు ఘనంగా నిర్వహించారు. లోక కల్యాణం, ధర్మ పరిరక్షణ కోసం ఈ నవరాత్రులు నిర్వహించినట్లు దత్తేశ్వరానంద భారతి మహాస్వామి తెలిపారు. పూర్ణాహుతితో శనివారం ఉత్సవాలు ముగిశాయన్నారు. కాగా డిప్యూటీ సీఎం సతీమణి నందిని, తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషనర్ చైర్ పర్సన్ నేరెళ్ల శారద, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి దంపతులు శనివారం వారాహి దేవి పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ వారాహి నవరాత్రులు తొమ్మిది రోజులు ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలను నుండి భక్తులు తరలివచ్చి పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారని తెలిపారు.